క్లుప్తంగా

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో బుధవారం జూనియర్ విభాగం ఆరుపల్ల బండలాగుడు పోటీలను మహాశివరాత్రి సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామకీర్తలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పల్లె నాగరాజు ప్రారంభించారు. ఈ పోటీలో పలు రాష్ట్రాల నుంచి దాదాపు 8 జతల వృషభరాజులు పాల్గొనగా హోరాహోరీగా కొనసాగాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి నంద్యాల జిల్లా తుమ్మలూరుకి చెందిన పల్లవికి రూ.40వేలు దాత పల్లె నారాయణ అందించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, సత్యం, యాగప్స్, మహేష్, ఎల్లస్వామి, మైమూద్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో పుష్పయాగం

కోడేరు: మండలంలోని ఎత్తంలో బుధవారం కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు దొరస్వామి తెలిపారు. ఉదయం సుదర్శన యోగ కల్యాణోత్సవం, హోమం, అన్నమయ్య సంకీర్తనలు, వంద రకాల క్వింటా పూలు, వంద రకాల పండ్లతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. పుష్పయాగానికి దాత వేణుగోపాల్‌రెడ్డి రూ.7లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణానికి బుధవారం సర్పంచ్ కాలే లక్ష్మమ్మ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ సహకారంతో మంజూరైన రూ.5లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కాలే వెంకటేష్, రమేష్‌గౌడ్, కృష్ణయ్య, రవికుమార్, తిరుపతి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజలపై భారం తగదు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి లాంటి ప్లాంట్ల విషయంలో కాలం చెల్లిన సాంకేతికతను వినియోగిస్తున్నారని, ఈ కొనుగోలుకు ప్రజలపై భారం మోపడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలపై పెడుతున్న భారాలను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మల్లేశ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, కొత్త శ్రీను, మేశ లక్ష్మయ్య, నిరంజన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

లింగాల: మండల పరిధిలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐ అతినారపు రవి స్టడీ మెటీరియల్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం దాత తండ్రి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎస్ఆర్ఐకి హెచ్ఎం తాహెర్‌పాషతో ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సుబ్బయ్య, మురళీధర్ రెడ్డి, సూర్యనారాయణ, అచాలి, పద్మమ్మ, ఐశ్వర్య, శ్రీవాణి పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం



కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్ర పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యా బోధనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు జంగయ్య, రామకృష్ణ, శివకుమార్, పావని తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల దాడి సరికాదు

అమ్రాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్‌పై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖైరత్, ఎంపీటీసీ రాయాంజనేయులు, కాంగ్రెస్ మండల వర్కింగ్ అధ్యక్షుడు హరినారాయణగౌడ్, సంతోష్‌నాయక్, రేణయ్య, అంబ నారాయణ, సైదులు, వెంకటేష్, మహేష్, అంజి తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం

లింగాల: మండల పరిధిలోని శ్రీరంగాపూర్‌కు చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. మంగళవారం ఉదయం బహిర్భూమికని ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాలేదని, తెలిసిన వారి దగ్గర వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేజీబీవీలో సమస్యల తిష్ట!

- తాగునీటికి తప్పని తిప్పలు
- పలుచోట్ల సొంత భవనాలు కరువు

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం



విద్యార్థినులకు నీటి సమస్య లేకుండా చూస్తున్నాం. తాగునీరు ఆలస్యంగా వచ్చినా అప్పటికే విద్యార్థినులు బాటిళ్లలో నిల్వ ఉంచుకుంటారు. సొంత భవనం పూర్తి కావొస్తుంది. నూతన భవనం అందుబాటులోకి వస్తే అన్ని సమస్యలు తొలుగుతాయి.

– శారద, ఎస్‌ఓ, అమ్రాబాద్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం



కేజీబీవీలో మంచి నీరు అందుబాటులో లేకుండానే టిఫిన్ చేస్తున్న విద్యార్థినులు

అమ్రాబాద్: పట్టణంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో తాగునీటి సమస్య ఉందని బుధవారం ఉదయం సాక్షివిజిట్ చేసిన సమయంలో వెలుగులోకి వచ్చింది. అయితే కేజీబీవీ పాఠశాల స్థానిక ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల అదనపు భవనంలో కొనసాగుతుంది. ఆరు నుంచి పదోతరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో మొత్తం 200మంది విద్యార్థినులు విద్య అభ్యసిస్తున్నారు. అవసరాల కోసం ఉపయోగించుకునే నీరు కూడా స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆవరణలో ఉన్న బోరు నుంచే కేజీబీవీకి నీటి సరఫరా అవుతుంది. పూర్తి స్థాయిలో సరిపోవడం లేదు. ముఖ్యంగా తాగునీటిని అమ్రాబాద్ నుంచి కాకుండా ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్ననూర్ నుంచి తెప్పిస్తున్నారు. ఒక్కోసారి సమయానికి నీరు రాక పోతే బోరునీరే దిక్కవుతుందని విద్యార్థినులు తెలిపారు. ఉదయం విజిటింగ్ సమయంలో కూడా టిఫిన్ పూర్తయ్యేవరకు తాగునీరు రాలేదు.

అచ్చంపేట రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో వసతులు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎంజేపీ బాలికల పాఠశాలను ఏబీవీపీ ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యార్థులనడిగి సమస్యలు తెలుసుకున్నారు. బాలికలు ఉన్నటువంటి అద్దె భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. కనీస వసతులు లేవన్నారు. సరైన వసతులతో కూడిన నూతన భవనం నిర్మించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యత లేని కూరగాయలు

తాడూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో కూరగాయల వినియోగంలో నాణ్యత లోపించింది. బుధవారం పాఠశాలను పరిశీలించగా పాఠశాలలో విద్యాపరంగా పాఠ్య పుస్తకాల జాప్యం జరగడంతో విద్యార్థులు రాణించలేకపోయారన్న విషయాలను ఉపాధ్యాయులు తెలిపారు. అన్ని పాఠ్యపుస్తకాలు ఒకే సారి రాకపోవడంతో చదువు మందగించిందని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల ముందు నుంచే రామన్‌పాడ్ పైప్‌లైన్ వెళ్లడంతో నీటి కొరత లేదని, విద్యార్థులకు కావాల్సిన మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి ప్రతి రోజు తెప్పించుకుంటున్నామన్నారు. పాఠశాలకు అందించే కూరగాయలు నాణ్యతతో ఉండేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. పాఠశాలలో 10వ తరగతిలో ఉన్న 40 మంది విద్యార్థినిలకు ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగిస్తున్నామన్నారు. పాఠశాలలో మొత్తం 200 మంది బాలికలకు 185 మంది బాలికలు హాజరవుతారన్నారు. వివిధ కారణాలతో మిగతా బాలికలు పాఠశాలకు గైర్హాజరవుతున్నారని పాఠశాల సిబ్బంది తెలిపారు.



10 వతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ

ప్రహరీ నిర్మించాలి

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. పాఠశాల చుట్టూ వివిధ విద్యాసంస్థలు ఉన్నాయని, వాటన్నింటికి ప్రహరీ నిర్మించారన్నారు. వ్యవసాయ పొలాలకు సమీపంలో ఉన్న కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రాత్రి వేళల్లో విషపురుగులతో పాటు మరికొన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో బుధవారం యూటీఎఫ్ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి మద్దతుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌శర్మ ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేసే ఏకైక ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ అని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి అన్నారు.

కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయులకు పరిష్కారం చూపిన ఏకైక సంఘం పీఆర్‌టీయూ మాత్రమేనని ఆ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి చెప్పారు. బుధవారం పట్టణంలో ఉపాధ్యాయులను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు.

తాడూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి సందర్శించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



వెల్దండలో ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

పెద్దకొత్తపల్లి: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పీఆర్‌టీయూ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి గెలుపుకోసం మండలంలో బుధవారం ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు టీచర్లతో కలిసి ప్రచారం నిర్వహించారు.

నల్లబ్యాడ్జిలతో బీఎస్పీ నాయకుల నిరసన



నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందిన ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియల విషయంలో అధికారిక లాంఛనాలు పాటించలేదన్న విషయంపై బీఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో కులానికో న్యాయం జరుగుతుందని విమర్శించారు. బీఆర్‌ఎస్‌లో బహుజనులకు స్వేచ్ఛ లేదని, చేతులకు, కాళ్లకు నల్లబ్యాడ్జిలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ కార్యదర్శి మహేశ్ యాదవ్, మండల అధ్యక్షుడు నాగేశ్, పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్, నాయకులు మంతటి శేఖర్, రాములు, బాలరాజు, భాస్కర్, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో తపాలా సేవలు

లింగాల: తపాలా శాఖ సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని పోస్టల్ సబ్ డివిజన్ అధికారి విక్రమ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీసులో ఆన్‌లైన్‌లో ఖాతాలు తెరవడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈనెల 20 నుంచి 24వ తేది వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తపాల శాఖలో చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకొని లాభం పొందవచ్చని అన్నారు. మొత్తం 9 రకాల పథకాలను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. రికరింగ్ డిపాజిట్ పథకంలో రూ.100 నుంచి ఎంత మొత్తమైన జమ చేసుకునే అవకాశం ఉందని, మంత్లీ ఇన్‌కమ్ స్కీం(ఎంఐఎస్), కిసాన్ వికాస్ పత్రం, పీపీఎస్ లాంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన పోస్టల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఓ మహిమూద్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌సీ మార్కుల పరిశీలన



తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి ఇంటర్నల్ మార్కులను పరిశీలించారు. ఆయా పాఠశాలల జీహెచ్‌ఎంలు తిరుపతయ్య, బుచ్చారం, ఎంఈఓ భాస్కర్ రెడ్డిలు విద్యార్థుల మార్కుల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మార్కులు వేసే క్రమం, ఉత్తీర్ణత శాతం, వివిధ అంశాలపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీ వితరణ



తాడూరు: మండలంలోని తుమ్మలసూగూరు ప్రాథమిక పాఠశాలకు రూ.50 వేల విలువైన శ్యాంసంగ్ టీవీని క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో మిర్యాల నవీన్‌కుమార్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయులు ప్రమోద్, రాఘవేందర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటివెలుగు పరీక్షలు



ఇంద్రకల్‌లో అద్దాలు పంపిణీ చైర్మన్ రమణ

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో బుధవారం కంటివెలుగు పరీక్షా కేంద్రాన్ని రైతువేదిక భవనంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డు రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సమ్మద్ పాష, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, వైద్యాధికారి డాక్టర్ ఎండీ ఇస్మాయిల్, సిబ్బంది శ్రీనివాసులు, శారద పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల పరిధిలోని గ్రామాల్లో కంటి వెలుగు శిబిరం కొనసాగుతోంది. బుధవారం మండలంలోని కాంసానిపల్లి, జప్తీ సదగోడు గ్రామాల్లో రెండు బృందాలు కంటి వెలుగు శిబిరాలను నిర్వహించారు. కాంసానిపల్లిలో 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో కంటిచూపు మందగించిన 12 మందికి కంటి అద్దాలు అందజేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్న తెలిపారు. అదేవిధంగా జప్తీ సదగోడులో 138 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

చారకొండ: అంధత్వ రహితమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మర్రిపల్లి సర్పంచ్ నరేష్ నాయక్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో బుధవారం రెండవ విడత కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ నరేష్ నాయక్ ప్రారంభించారు. గ్రామంలో 113 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 32 మందికి కంటి అద్దాలు అందించినట్లు వైద్యాధికారి భార్గవి, కంటి వైద్యాధికారి సురేఖ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, వైద్యాధికారులు ఉన్నారు.

ఎమ్మెల్సీ నిధులతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



తెలకపల్లి: మండల పరిధిలోని పర్వతాపూర్‌లో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి నిధులతో మూడు హైమాస్ట్ లైట్లు ఏర్పాటైనట్లు ఆ గ్రామ సర్పంచ్ జనుంపల్లి లక్ష్మమ్మ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వరమ్మ, గ్రామస్తులు రాములు, లింగస్వామి, పర్వతాలు, సైదులు గౌడ్, రేణయ్య, శివ, జంగయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కల్వకుర్తి టౌన్: ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లికల్ నుంచి పట్టణానికి బుధవారం తెల్లవారుజామున ఇసుక ట్రాక్టర్ వస్తుండగా పెట్రోలింగ్ సమయంలో పట్టుకొని విచారించినట్లుగా ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లుగా ఎస్ఐ తెలిపారు.

దళిత బంధు యూనిట్ల వివరాలను నమోదు చేయాలి

చారకొండ: దళిత బంధు పథకం ద్వార ప్రభుత్వం అందించిన యూనిట్ వివరాలను, వ్యాపార లావాదేవీలను దళిత బంధు మొబైల్ యాప్‌లో వారి పూర్తి వివరాలను యూనిట్ స్థితిని నమోదు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్ అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం దళిత బంధు పథకం మొబైల్ యాప్‌పై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఈడీ రాంలాల్ హాజరై మాట్లాడారు. మండలంలోని కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాల సంబంధించి మొత్తం 1,407 లబ్ధిదారులకు దాదాపు 90 మంది లబ్ధిదారులకు యూనిట్లు అందించారు. అనంతరం జీవన స్థితిగతులపై మార్పు వచ్చిందా.. పూర్తి వివరాలను సేకరించి మొబైల్ చేయాలని గ్రామాల కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయసుధ, ఎంపీఓ వెంకటేష్ ఉన్నారు.



మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలి

వెల్దండ: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో విత్తనాలు నాటించి మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కేస్లీతండాలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీలను, డంపింగ్‌యార్డు, శ్మశాన వాటికలను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కావడంతో హరితహారంలో నాటిన మొక్కలను రక్షించుకోవాలన్నారు. నర్సరీల్లో మట్టితో బెడ్లను నింపి విత్తనాలను నాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జి, ఏపీఓ ఈశ్వర్, ఈసీ దేవేందర్‌గౌడ్, టీఏలు శివలీల, లింగస్వామి, కార్యదర్శి విష్ణువర్ధన్, లక్ష్మణ్‌నాయక్, ఫీల్డ్‌అసిస్టెంట్ చంద్రకళ తదితరులు ఉన్నారు.



వెల్దండలో నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి

సీఎంఆర్‌ఎఫ్‌తో మేలు

వెల్దండ: ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్‌ఎఫ్ పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. పోతేపల్లికి చెందిన తాండ్ర రమేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపతిరెడ్డి, మాజీ ఎంపీపీ జయప్రకాష్, నాయకులు జైపాల్‌నాయక్, భాస్కర్‌రావు, వెంకటయ్యముదిరాజ్, అలీ, తానేష్‌యాదవ్, ఆనంద్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఘన నివాళి

కందనూలు: టీయూడబ్ల్యూజే యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అల్లం పద్మ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: అల్లం నారాయణ సతీమణి అల్లం పద్మ ప్రథమ వర్ధంతిని టీయూడబ్ల్యూజే(హెచ్–143) ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎండీ రవూఫ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



కల్వకుర్తిరూరల్: అన్నదానం మహాదానం అని లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేశ్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శివరాంలు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే గర్భిణులు, బాలింతలు, రోగుల కోసం లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. క్లబ్ కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, గోవిందు శ్రీనివాస్, రమేశ్, అశోక్, ప్రకాశ్, రాఘవేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

తెలకపల్లి: కాంగ్రెస్‌తోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గట్టురాయిపాకులలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయిపాకుల గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దళితవాడల్లో ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్లు ఇచ్చామని, జీవన విధానం మెరుగుకావడం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందించామన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాలు సాధ్యమన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అధికారం కేవలం ఒక ఇంటికే పరిమితమైందని ప్రజలు గుర్తించాలన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వార ఇచ్చిన స్ఫూర్తితో రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాదయాత్ర కొనసాగుతున్న తరుణంలో వారిని ఆదర్శంగా తీసుకుని గడపగడపకు ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే సుపరిపాలన అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నారాయణగౌడ్, వెంకటయ్య గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్ర, నాగం శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



గట్టురాయిపాకులలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తున్న నాగం జనార్దన్‌రెడ్డి

జీవాలకు నట్టల నివారణ మందు



రాఘయపల్లిలో మందులను పంపిణీ చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి జీవీ రమేష్

పెద్దకొత్తపల్లి: పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పెద్దకార్పాముల, చిన్నకార్పాముల, చిన్నకొత్తపల్లిలలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును పంపిణీ చేసినట్లు డాక్టర్ మధు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సలీం, రమేశ్, యాదగిరి పాల్గొన్నారు.

కోడేరు: ఉచిత నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ భానుకిరణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

వెల్దండ: ప్రభుత్వం గొర్రెల, మేకల సంరక్షణ కోసం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మందులను అందిస్తుందని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జీవీ రమేష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రాఘయపల్లిలో నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు అచ్చాలు, గాలమ్మ, కోమిటి, బక్యనాయక్, ఎంపీటీసీ మోతీలాల్‌నాయక్, వెల్దండ పశువైద్య అధికారి శ్యామ్‌సుందర్ ఉన్నారు.

చారకొండ: మండల కేంద్రంతోపాటు మర్రిపల్లిలో బుధవారం పశువైద్య అధికారి శివకుమార్ జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. చారకొండ సర్పంచ్ విజేందర్ గౌడ్, మర్రిపల్లి సర్పంచ్ నరేష్ నాయక్ ఉన్నారు.

అమ్రాబాద్: స్థానిక పశువైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం లక్ష్మాపూర్(బీకే), లక్ష్మాపూర్‌తండా, ఒంగురోనిపల్లి గ్రామాలలో జీవాలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. మూడు గ్రామాలలో 2,471 గొర్రెలు, 1,968 మేకలకు తాపినట్లు పశువైద్యాధికారి తెలిపారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

వెల్దండ: మండల పరిధిలోని గాన్‌గట్టుతండాలో బుధవారం సర్పంచ్ పత్యానాయక్ సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో పాఠశాల సమీపంలోని రోడ్డు బురదమయంగా ఉంటుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లడంతో రూ.5లక్షల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భర్కత్‌పల్లి సర్పంచ్ బీరయ్య, పీఆర్‌ఏఈ మహేందర్ తదితరులు ఉన్నారు.

అధైర్యపడవద్దు: జూపల్లి



మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు: అభివృద్ధి పనులను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని నర్సాయిపల్లి, బాడిగదిన్నెలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షలతో తమ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కార్యకర్తలు ఎవరు అధైర్యపడవద్దని, తమకు అండగా నేనున్నానని భరోసా ఇచ్చారు. కార్యకర్మంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.